విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 18, జూన్ 2024

కార్గిల్ విజయ్ దివస్ ఆర్మీ బైక్ యాత్ర ప్రారంభం...

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం నగరంలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో సోమవారం ఉదయం కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్-2024 సందర్భంగా ఇండియన్ ఆర్మీ అధికారులు చేపట్టిన పాన్ ఇండియా మోటార్ సైకిల్ దక్షిణ ప్రాంత (డి5 మోటార్ సైకిల్) యాత్రను ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.జెండా ఊపి ప్రారంభించారు. అనంతపురం జిల్లా నుండి కార్గిల్ ప్రాంతంలో ఆర్మీ విధులు నిర్వహించిన మాజీ సైనికులు ఉమా మహేశ్వరరావుతో పాటు మొత్తం నలుగురు మాజీ సైనికులను కలెక్టర్ డా.వినోద్ కుమార్, లెఫ్టినెంట్ కల్నల్ మనోజ్ కుమార్ నాయర్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప, కెప్టెన్ ఆదర్శ్ జన్మేదా కార్గిల్ విజయ్ దివస్ బ్యాడ్జ్‌లతో గౌరవప్రదంగా సన్మానం చేసారు. దేశం నలుమూలల నుండి ఆర్మీ అధికారులు చేపట్టిన పాన్ ఇండియా మోటర్ సైకిల్ దక్షిణ ప్రాంత యాత్ర ధనుష్కోడి నుండి బెంగళూరు మీదుగా అనంతపురం జిల్లాకు ఆదివారం సాయంత్రం చేరుకుంది. సోమవారం సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుని, నాగపూర్, గ్వాలియార్, ఢిల్లీ మీదుగా జమ్మూ కాశ్మీర్ ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్‌కు జూలై 26 లోపు చేరుకుంటుంది.

ప్రతి సాగుభూమిలో నీటి సంరక్షణ నిర్మాణం తప్పనిసరి

- సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి
- కలెక్టర్ వినోద్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: వ్యవసాయానికి వాననీటిపై మాత్రమే ఆధారపడ కుండా, సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం నగరంలోని పంగల్ రోడ్‌లో ఉన్న ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటర్ నిర్వహించిన ప్రపంచ కరువు ఎడారీకరణ నివారణ దినోత్సవంలో కలెక్టర్ మాట్లాడుతూ భూములను బీడుగా ఉంచవద్దని, ఎడారీకరణ సంకేతాలను తిప్పికొట్టేందుకు కనీసం పశుగ్రాసం కోసం ఏదైనా పండించాలని రైతులకు సూచించారు. జిల్లాలో గత కొన్ని దశాబ్దాలుగా వర్షాలు తక్కువగా లేదా విపరీతంగా కురు స్తున్నాయని, కాబట్టి వ్యవసాయ చెరువు లేదా మరేదైనా నీటి సంరక్షణ నిర్మాణం ఆవశ్యకతపై రైతు సమాజంలో అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఏ ఎఫ్ ఎకాలజీ సెంటర్‌ను ఆచరిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. వాటర్‌షెడ్ ప్రాజెక్టులు, ఫారం పాండ్‌లు, గట్లపై సీడ్ డ్రిబ్లింగ్‌లో అనంతపురం జిల్లా ముందంజలో ఉందని, ఎ.ఎఫ్.ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి.ని అభినందించారు. గత 4 దశాబ్దాలకు పైగా మల్లారెడ్డి ఈ ప్రయత్నాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తు న్నారన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలాల్లో సరిహద్దు మొక్కలుగా నాటేందుకు వంద మొక్కలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఇందుకు టేకు, మహోగని, గంధపుచెట్లు, ఎర్రచందనం చింతపండు మొక్కలు అటవీశాఖ నర్సరీలలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవరైనా తీసుకోవచ్చన్నారు. ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటర్, అనంతపురం జిల్లాలోని ఎనిమిది మండలాల్లో గత 40 సంవత్సరాలుగా నీటి సంరక్షణ ప్రాజెక్టులపై పని చేస్తోంది కొన్ని వాతావరణ-తట్టుకోగల పంటలను ప్రదర్శన ప్లాట్లను ఉపయో గించి విత్తే నమూనాలను అభివృద్ధి చేసింది సాంకేతికతను 25వేల ఎకరాలకు విస్తరించి 30వేల మంది రైతులకు ఉపయోగపడిందని తెలిపారు. అనంతపురంలో 2023లో ఎన్నడూ లేని విధంగా కరువు ఏర్పడిందని, ఈ ఏడాది జూన్‌లో 140 మి.మీ, 515 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్ రైతులకు 5వేల మందికి సహాయం చేశాయని డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. నీటి సంరక్షణ నిర్మాణాల ద్వారా రక్షిత నీటిపారుదలని అందించడంలో ఉపయోగపడతాయన్నారు.

మోసాల ప్రభుత్వాన్ని సాగనంపాం..

ఎమ్మెల్యే పరిటాల సునీత

విశాలాంధ్ర-రాప్తాడు : ఐదేళ్ల పాటు కుట్రలు, కుతంత్రాలతో సాగిన మోసాల ప్రభుత్వాన్ని సాగనంపామని.. ఇప్పుడు మాట నిలబెట్టుకునే నాయకుడు వచ్చాడని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో టీడీపీ రాప్తాడు కన్వీనర్ పంపు కొండప్ప, సర్పంచ్ తిరుపాల్ కలిసి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు చెప్పినట్టుగానే ఐదుకీలక హామీలు నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఐదు ఫైల్స్‌పై సంతకాలు చేశారన్నారు. నిరుద్యోగుల ఆశలను నెరవేరుస్తూ.. ఏకంగా 16,347 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసేలా మెగా డీఎస్సీపై సంతకం చేశారని...దీనిపై నిరుద్యోగులు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కిందన్నారు. ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీనిచ్చిన జగన్‌రెడ్డి ఒక్క పోస్టు, ఒక్క క్యాలెండర్ ఇవ్వకుండా నిరుద్యోగులు, యువతను మోసం చేశారన్నారు. ప్రజల భూములకు రక్షణ లేకుండా జగన్ రెడ్డి తీసుకొచ్చిన నల్ల భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తూ చంద్రబాబు రెండవ సంతకాన్ని చేశారన్నారు. అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసి హామీ నెరవేర్చారన్నారు. పింఛను రూ. 4వేలకు పెంచారన్నారు. ఇప్పుడు 66లక్షల మందికి నాలుగు వేల చొప్పున అలాగే ఏప్రిల్ నుంచే పెరిగిన పింఛను అమలుచేస్తా మన్న విధంగా రూ. 7వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. నైపుణ్య మెలకువలు పెంచే విధంగా నాల్గవ సంతకం నైపుణ్య గణన మీద చేశారన్నారు. గతంలో బి అన్నా క్యాంటీన్లను తీసుకొస్తే.. జగన్ రెడ్డి కక్ష పూరితంగా మూసివేయించారన్నారు. కానీ పేదల ఆకలిని గుర్తించిన చంద్రబాబు అన్నా క్యాంటీన్లను తెరిచే విధంగా 5వ సంతకం చేశారన్నారు. ఇన్ని రోజులు విధ్వంసాలతో సాగిన పాలన ముగిసిందని.. ఇక నుంచి ప్రజలు మెచ్చే విధంగా పాలన సాగుతుందన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ ...

- కిటకిటలాడిన ఈద్గాలు
- ప్రవక్త సందేశాన్ని వినిపించిన మతపెద్దలు
- పేదలకు దానధర్మాలు చేసిన ముస్లింలు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: బొమ్మనహాళ్ మండలం లో బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈద్గాలు, మసీదులకు వెళ్లి విశేష ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ కారణంగా మండల వ్యాప్తంగా సందడి వాతావరణం కనిపించింది. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కేశవరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీలు కుమ్మరి మల్లికార్జున, వాణి జగన్నాథ్ రెడ్డి, ముల్లంగి నారాయణస్వామి, మహేంద్ర పయ్యావుల అనిల్, ఎర్రగుంట్ల వెంకటేశులు, క్లస్టర్ కన్వీనర్ మాలపాటి ధనంజయ ఉప్పరహాల్ స్వామి తదితరులు మసీదు, ఈద్గాల వద్దకు చేరుకోని ముస్లీంలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మనహాల్, ఉద్దేహాల్, గోవిందవాడ, దర్గాహెానూర్, ఏళంజి శ్రీధరఘట్ట తదితర గ్రామాల ఈద్గాలలో ముతవల్లిలు నమాజు చేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

త్యాగనిరతికి ప్రతీక ...

విశాలాంధ్ర-శింగనమల: ప్రపంచ మానవాళి శ్రేయస్సుకు తనకొక్కగానొక్క కుమారుడిని బలి ఇచ్చేందుకు అసమాన త్యాగనిరతిని ప్రదర్శించి,స్ఫూర్తిగా నిలిచిన ఇస్లాం ప్రవక్త ఇబ్రహీం జీవితం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, లోక కల్యాణం నిమిత్తం మహానుభావులు ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతారని, అనే సందేశం ఇచ్చే ఈ పండుగను ముస్లిం సోదరులు పవిత్రంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. ఈ బక్రీద్ పండుగ జరుపుకుంటున్న ముస్లిం సోదరులకు మరియు వివిధ ప్రాంతాల్లోని నా ఆత్మీయ ముస్లిం మిత్రులందరికీ సిఐ శ్రీధర్ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండల కేంద్రంలో సోమవారం అత్యంత ఘనంగా బక్రీద్ పర్వదినం వేడుకలను జరిగాయి. ఈద్గా వద్ద ముస్లిం సోదరులు వేలాది సంఖ్యలో హాజరై బక్రీద్ పర్వదినం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టత తెలియజేశారు. అనంతరం ఒకరికొకరు ఆ లింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: రాయదుర్గం పట్టణంలోని బళ్ళారి రోడ్డు ఈద్గాలో భక్తి శ్రద్ధలతో ఈదుల్ అజ్హా బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైఫుల్ల (ఈదుల్-అద్హా) బక్రీద్ ప్రాముఖ్యత హజ్రత్ ఇబ్రహీం అలైహిస్సలాం యొక్క త్యాగాల గురించి గుర్తుచేశారు. ప్రవక్త మొహమ్మద్ సల్లలాహు అలైహి వసల్లం మనకు ఇచ్చిన సందేశం గురించి వివరించారు. బళ్లారి రోడ్ శాంతి నగర్, కనేకల్ రోడ్డు, బి టి పి రోడ్డు, ములకలమూరు రోడ్డు తదితర ఈద్గా మైదానాల్లో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో తెల్లవారుజామునే కుటుంబీకులతో సహా చేరుకొని ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, వైసీపీ నేత మెట్టు గోవిందరెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంతో పాటు రాయల చెరువు వేములపాడు గ్రామాలలో ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. యాడికి జామియా మసీదులో ఉదయం నుండి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జామియా మసీదు నుండి ర్యాలీగా బయలుదేరి అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ ప్రవచనాలు చదువుతూ కోన రోడ్డులోని ఈద్గా మైదానం చేరుకున్నారు. మత గురువులు మసూద్ హాఫీజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు బక్రీద్ పండగ విశిష్టతను వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆ లింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సిఐ నాగార్జున రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఘన స్వాగతం

ఉరవకొండకు వచ్చిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

విశాలాంధ్ర-అనంతపురం బ్యూరో/ఉరవకొండ : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు సోమవారం ఉరవకొండ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా సరిహద్దు గుత్తి మండలంలోని సుంకులమ్మ గుడి వద్దకు పయ్యావుల కేశవ్ చేరుకోగానే సుంకులమ్మ గుడి వద్ద అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. సుంకులమ్మ గుడిలో అమ్మవారికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి గుత్తి పట్టణానికి చేరుకుని అక్కడి మహాత్మా గాంధీ విగ్రహానికి, ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఉరవకొండకు వచ్చారు. దారి పొడవునా కూడేరు, జల్లిపల్లి, చిన్న ముష్టూరు, గ్రామాల్లో కూడా మంత్రికి ప్రజలు స్వాగతం పలికారు. స్థానిక బైపాస్ సమీపంలో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి మంత్రికి ఘనంగా ఆహ్వానం పలికారు. టవర్ క్లాక్ వద్దకు చేరుకున్న మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఆయన తన స్వగ్రామైన పెద్ద కౌకుంట్లకు చేరుకున్నారు. ఆమిద్యాల, రాకెట్ల, కౌకుంట్ల గ్రామాల్లో కూడా మంత్రికి ఆ గ్రామాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

గజమాలతో ఎమ్మెల్యే శ్రావణి శ్రీ సత్కారం

విశాలాంధ్ర-శింగనమల: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొట్టమొదటిసారి అనంతపురం జిల్లాలోకి విచ్చేసిన పయ్యావుల కేశవ్‌కి శింగనమల నియోజక వర్గం, గార్లదిన్నె మండలం, కల్లూరు గ్రామంలో శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గజమాలతో ఘనంగా స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ, జనసేన, బిజెపి పార్టీల నాయకులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విశాలాంధ్ర-యాడికి: జిల్లా సరిహద్దులోని కరటికొండ వద్ద ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, యాడికి మండల టిడిపి నాయకులు కార్యకర్తలు సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాడికి మండలం కన్వీనర్ గొర్తిరుద్రమ నాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య,రవి కుమార్ రెడ్డి, వెలిగండ్ల ఆదినారాయణ, దడియాల ఆది, అమిలినేని సత్య,తాండ్ర విక్రమ్, నగరూరు నరసింహులు, గోపాల్ నాయుడు, శుభాన్,చంద్ర, శ్యామ్ సుందర్ మంత్రికి ఘన స్వాగతం పలికారు.

భారీ వాహనాలతో బయలుదేరిన ఎమ్మెల్యే సురేంద్రబాబు

విశాలాంధ్ర- కళ్యాణదుర్గం టౌన్: తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత ఆర్థిక శాఖ మంత్రి పయ్యా వుల కేశవ్ తొలిసారి జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా అమి లినేని సురేంద్రబాబు 200 వాహనాలతో స్వాగతం పలి కేందుకు బయలుదేరారు. సోమవారం ఎమ్మెల్యే ప్రజా వేదిక వద్ద పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. కర్నూలు చివరిని గల సుంకలమ్మ గుడి దగ్గరకు కేశవ్ వస్తున్న సందర్భం గా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు తెలుగు తమ్ముడు వెళ్లారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలతో పాటు మోరేపల్లి మల్లికార్జున, రామ్మోహన్ చౌదరి, వై పి.రమేష్, పాపం పల్లి రామాంజనేయులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు శర్మాస్,తదితరులు పాల్గొన్నారు.

హత్య చేసిన నిందితుడు అరెస్టు

మద్యం తాగేందుకు డబ్బులు, చికెన్ ఇవ్వలేదని రాయితో మోది హత్య..

ఒక్కరోజులోనే కేసును ఛేదించిన పోలీసులు...

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన మురడప్పను హత్య చేసిన హరిజన చిట్టిబాబు(యేసురాజు)ను సోమవారం సాయంకాలం అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం డిఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రాయదుర్గం పట్టణంలోని పోలీస్‌స్టేషన్లో సీఐలు ప్రసాద్‌బాబు, శ్రీనివాసులుతో కలిసి విలేఖర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. మురడి గ్రామానికి చెందిన మురడప్ప ఆదివారం దేవాలయంలో పనులు ముగించుకొని దేవాలయం వెనుక భాగాన ఉన్న చిన్న వాటర్ ట్యాంకు వద్ద చికెన్ చేసుకుంటూ ఉన్నాడు. ఆ సమయంలో హరిజన చిన్నబాబు(యేసురాజు) అక్కడికి వెళ్లి తనకు తాగడానికి డబ్బులు కావాలని, తనకు కూడా చికెన్ వండి పెట్టమని మురడప్పతో గొడవ పెట్టుకున్నాడు. ఎంతసేపటికి మురడప్ప డబ్బులు లేవు చికెన్ కూడా కొద్దిగే ఉందని ఇవ్వలేను అనిచెప్పడంతో హరిజన చిన్నబాబు(యేసురాజు) ఆవేశం పట్టలేక అక్కడే ఉన్న పదునైన రాయితో హరిజన మురడప్ప తలపై బలంగా కొట్టడం వల్ల మురడప్ప తలకు తీవ్ర రక్త గాయమై అక్కడే చనిపోయాడు.. తరువాత హరిజన చిన్నబాబు అక్కడి నుండి పరారయ్యాడు. మృతుడి పినతల్లి హరిజన పెన్నక్క ఫిర్యాదు మేరకు హీరేహాళ్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా రాబడిన సమాచారం మేరకు సోమవారం సాయం కాలం 5గంటల సమయంలో కల్యం గ్రామ బస్‌స్టాప్ వద్ద ముద్దాయి హరిజన చిన్నబాబు(యేసురాజు)ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు తాగుడుకు బానిసై గ్రామంలో జులా యిగా తిరిగేవాడని, మద్యం కోసం గ్రామస్థులతో బలవంతంగా డబ్బులు అడిగేవాడని, ఇవ్వకపోతే వారిపట్ల దురుసుగా ప్రవర్తించేవాడని పోలీసుల తెలిపారు. మురడప్ప తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడంతోనే రాయితో కొట్టి చంపానని నిందితుడు పోలీసుల ఎదుట అంగీకరించాడు. నిందితుడి నుంచి నేరానికి ఉపయోగించిన రాయిని స్వాధీనం చేసు కొన్నారు. ఒక్కరోజులోనే హత్య కేసును ఛేధించడంలో కృషి చేసిన రాయ దుర్గం రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, డి.హీరేహాళ్ ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందిని ఎస్పీ గౌతమిశాలి ఐపిఎస్, కళ్యాణదుర్గం డిఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

ఎలాంటి సమస్యలు లేకుండా నీటి సరఫరా చేస్తాం..

హెచ్చెల్సీ అత్యవసర పనులకు రూ.50 లక్షల ప్రతిపాదన : చీఫ్ ఇంజనీర్

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుండి వచ్చే సాగునీటిని ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందిస్తామని హెచ్చెల్సీ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఈ రాజశేఖర్తో కలిసి ఎగువకాలువను పరిశీలిం చారు. 181 జీబీసీ ఉంతకల్లు వద్ద 112 కి.మీ. పడిన గండిని, 119 కి.మీ. చెర్లోపల్లి వద్ద కోతకు గురైన కాలువ గట్లు, యూటీ ఛానళ్లను పరిశీలించారు. అత్యవసర మరమ్మత్తుల కింద రూ.50 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సీఐ తెలిపారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభిం చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. 119 కి.మీ. వద్ద దెబ్బతిన్న యూటీ ఛానల్ కు రూ.30 లక్షలు, 112 కి.మీ. వద్ద దెబ్బతిన్న కాలువ గట్టుకు రూ. 10 లక్షలు, 181 జీబీసీ వద్ద దెబ్బతిన్న పనులకు రూ. 8 లక్షలు ప్రతిపాదించామని దాదాపు రూ. 50 లక్షలు అవసరమవుతాయని తెలి పారు. వీరితో పాటు ఈఈ రమణారెడ్డి, డీఈ. మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

19న ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర-బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ వారి సౌజన్యంతో జూన్ 19వ తేదీన ఉచిత గొడ్డుమోతు పశువైద్య శిబిరం నిర్వహించబడునని డాక్టర్ బి.వెంకట్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్దేహాళ్ గ్రామంలోని పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో కేవలం గొడ్డుమోతు పశువులకు వైద్యం, చూలు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా సరఫరా చేసి తగు సూచనలు మరియు వైద్య సలహాలు ఇస్తారు. ఈ శిబిరానికి ప్రముఖ పశు వైద్య నిపుణులు డాక్టర్ టివి సుధాకర్, జిల్లా పశు ఘనాభివృద్ధి అధికారి మండల పశు సంవర్ధక శాఖ సిబ్బంది హాజరవుతారని తెలిపారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి..

సిపిఐ రాయదుర్గం నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున

విశాలాంధ్ర-రాయదుర్గం: రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. రాయదుర్గం నియోజకవర్గం సీపీఐ పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. సిపిఐ రాయదుర్గం నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ మొన్నటి రోజున జూన్ 12తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి రాజధాని అయిన హైదరాబాద్‌తో సంబంధాలు తెగిపోయిన రాష్ట్ర విభజన అనంతరం ఇచ్చిన విభజన హామీలు రాష్ట్రనికి ప్రత్యేక హెూదా అమలు పరచలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు వేయండి అన్నీ కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తెస్తారని రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో న్యాయం జరుగుతుంది అని, అది చంద్రబాబు నాయుడుతో సాధ్యమవుతుందని, ఎంతో ఆశగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు కలిసి ప్రత్యేక హెూదాపై విభజన హామీలు చట్టంలోని హామీలు అమలుపై ముఖ్యమంత్రి ముమ్మర ప్రయత్నం చేయాలని కోరారు. రాష్ట్రానికి వచ్చే నిధుల విషయంలో ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో, పోలవరం నిర్మాణ పనులు పూర్తి విషయంలో, పోలవరం నిర్వాసితుల విషయంలో ఇలా రాష్ట్ర అభివృద్ధి కొరకు కేంద్రంతో పెద్ద ఎత్తున నిధులు సేకరించి రాష్ట్ర అభివృద్ధి పరచాలని కోరారు. ముఖ్యమంత్రి చెప్పిన మాట ప్రకారం ఇచ్చిన హామీలపై సంతకాలు చేసి తాము ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అందుకుగాను ప్రజల తరపున మేము కూడా హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌కు అన్ని రకాలుగా దశ దిశ మారుతుందని, నమ్మకాలు ఉన్నందున నూతన ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి విషయంలో అన్ని రకాలుగా దూసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాలూకా సహాయ కార్యదర్శి గురుస్వామి, సీపీఐ గుమ్మగట్ట మండల కార్యదర్శి తిప్పేస్వామి, నరసింహులు, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కుమార్ కోట్రెష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కొండాపురంలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: రాయదుర్గం మండలంలోని డి.కొండాపురం గ్రామంలో వ్యవసాయ కూలీ మరియు చికెన్ సెంటర్ నిర్వహిస్తున్న ఆంజనేయులు(48) విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. ఆదివారం గొర్రె పిల్లలకు పచ్చగడ్డి తీసుకొస్తానని వెళ్లి ఒక తోటలో విద్యుత్ షాక్ తో మృతి చెందాడన్నారు. గొర్రె పిల్లలకు పచ్చి గడ్డి తీసుకొస్తానని రైతు పొలంలోకి వెళ్లి నా ఆంజినేయులు ఆదివారం సాయంత్రం అయన రాకపోవడంతో పలుచోట్ల వెతికినా కనిపించలేదన్నారు. స్థానికులు గుర్తించి పొలంలో పడి ఉండటంతో విద్యుత్ షాక్‌తో చనిపోయినట్లు గుర్తించారు.

వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

నేడు ధర్మవరానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాక

- భారీ ఏర్పాట్లలో మునిగిన ఎన్డీఏ కూటమి నాయకులు

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మంగళవారం ధర్మవరానికి రానున్నారని ఎన్డీఏ కూటమి శ్రేణులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్య కుమార్ యాదవ్ క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ధర్మవరం నియోజకవర్గానికి విచ్చేస్తున్న శుభ సందర్భంగా భారీ ఎత్తున స్వాగతం పలకడానికి అన్ని ఏర్పాటు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతున్నట్లు తెలిపారు. హాజరవుతున్నారు. మంగళవారం రోజున ఉదయం 9 గంటలకు అనంతపురం నుండి బయలుదేరి, ఎర్రాయపల్లి గ్రామం వద్ద నుండి ఫోర్ వీలర్స్ లో ర్యాలీగా బయలుదేరి, బత్తలపల్లి మీదుగా ధర్మవరం నియోజకవర్గంలోకి సత్యకుమార్ యాదవ్ విచ్చేస్తారని తెలిపారు. అందులో భాగంగా ధర్మవరం మండలం గొట్లూరు గ్రామం వద్దనుండి భారీ ఎత్తున బైక్ ర్యాలీ ద్వారా ధర్మవరం పట్టణంలోకి ఆహ్వానించడం జరుగుతుందన్నారు.

పట్టణంలో మంత్రి పర్యటన షెడ్యూల్...మొట్టమొదటిగా కదిరి గేటు వద్దనున్న చేనేత విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుండి దిమ్మెల సెంటర్ మీదుగా తేరుబజారు నుండి పట్టణంలో గల ప్రముఖ దేవాలయమైన దుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడినుండి కళాజ్యోతి సర్కిల్లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పిస్తారని తెలిపారు. అనంతరం ధర్మవరం పట్టణంలో గల మారుతీ నగర్(దుర్గానగర్) నందు నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిలో గౌరవ మంత్రి గారి చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమం జరుగును. కావున ఈ కార్యక్రమమునకు ధర్మవరం నియోజకవర్గంలో గల ప్రజలు ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు ప్రతి వార్డు నుండి ప్రతి పంచాయతీ,గ్రామం నుండి భారీగా టూవీలర్స్ ఉదయం 9 గంటలకు గొట్లూరు గ్రామం వద్దకు చేరుకోవాల్సిందిగా తెలిపారు.

మాజీ మంత్రి శంకర్ నారాయణ అవినీతి, అక్రమాలు వెలికితీస్తాం..

- వైసీపీ హయాంలో ఊర్లు వదిలించారు
- ప్రశాంతంగా ఉన్న పెనుకొండలో చిచ్చు రేపుతున్న శంకరనారాయణ
- మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప

విశాలాంధ్ర-గోరంట్ల : ఉమ్మడి ఎన్డిఏ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి శంకర్ నారాయణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వ హయాంలో చేసిన అవినీతి అక్రమాలు భూకబ్జాలపై విచారణ జరిపించి వెలికితీస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బుల్లెట్ బాబు ఇంటిపై రాళ్లు వేశారని పరామర్శించడానికి వచ్చి ఖబర్దార్ అనడం ఎంతవరకు సమంజసం అని ఇప్పుడు ఎవరో ఖబర్దార్ అనాలో గుర్తు చేసుకోవాలన్నారు. బుల్లెట్ బాబు కూడా ఎన్నో దందాలు, అక్రమాలు, కబ్జాలు చేశారని, రాళ్లు వేయడం తెలుగుదేశం జనసేన పార్టీలకు ఏమి అవసరమని అతని వ్యవహారాల వల్లే జరిగి ఉంటాయనీ, ప్రశాంతంగా ఉన్న గోరంట్లలో మళ్లీ చిచ్చు రేపడానికి వచ్చావా శంకరనారాయణ అంటూ ప్రశ్నించారు. నిర్దాక్షిణ్యంగా నడిరోడ్డుపై కబ్జాపై ప్రశ్నించిన జనసేన నాయకుడు సురేష్‌పై దాడి చేస్తుంటే నేనే పోలీసులకు సమాచారం ఇచ్చానని గుర్తు చేశారు. జర్నలిస్టులపై దాడులు చేశారని ప్రశ్నించిన వారిపై దాడులు చేసి నేడు మళ్లీ ఖబర్దార్ అనడం సిగ్గుచేటు అన్నారు. మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్ పట్టణ కన్వీనర్ కక్కల రఘునాథ్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉన్న గోరంట్ల మండలంలో మాజీ మంత్రి శంకర్ నారాయణ గ్రూపులు చేస్తూ రేపుతున్నారని మండల కన్వీనర్ సోమశేఖర్ అన్నారు. ఆదివారం వానవోలు ఉపసర్పంచ్ బుల్లెట్ బాబు ఇంటిపై రాళ్లు వేశారని పరామర్శించడానికి వచ్చిన తర్వాత అనవసరంగా తెలుగు దేశం, జనసేన పార్టీ నాయకులు వేశారని ఖబర్దార్ అంటూ ఆరోపణలు చేయడం హెచ్చరించడం సిగ్గుచేటని వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం మానుకోవాలి అన్నారు. బాబు చేస్తున్న దందాలు దౌర్జన్యాలు అరాచకాలు మండలంలో ఎవరిని అడిగిన చెబుతారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం హయాంలో ముస్లిం మైనార్టీ యువకుడిపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారని ఇంటి మీద దాడి చేసి అతనిని గాయపరిచారని అలాగే శ్రీశైలం శ్రీనివాసులు దేవాలయ భూములపై వార్తలు రాసిన విలేకరిపై కూడా దాడి చేసి కేసు పెట్టారని ఆరోపించారు. పెట్రోల్ బంక్ హంపయ్య మాట్లాడుతూ మాజీ మంత్రి శంకర్ నారాయణ మా ఇంట్లోనే చిచ్చు పెట్టాడని, దాదాపు 6 కోట్ల టర్న్ అవర్ చేస్తున్న పెట్రోల్ బంకులు సీజ్ చేయించి ఆర్థికంగా దెబ్బతీశాడన్నారు. తనను సోమందేపల్లికి వచ్చి బుల్లెట్ బాబు కూడా బెదిరిం చాడని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ కార్యదర్శి దేవా నరసింహప్ప, జిల్లా కార్యదర్శి బిరే వేణుగోపాల్ రాయల్, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

20న మెగా రక్తదాన శిబిరం... విజయవంతం చేయండి..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సాంస్కృతిక మండలిలో (మదీనా మసీద్ ఎదురుగా) ఈనెల 20వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బీరే శ్రీరాములు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే శ్రీ చౌడేశ్వరి దేవి సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను నిర్వహించడం జరిగిందని, రక్తదాతలందరూ కూడా తమ సహాయ సహకారాలతో రక్తదానం చేయడం నాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. రక్తదానం ఇచ్చుటలో అపోహలు పాల్పడవద్దని తెలిపారు. మీ రక్తదానం మరొకరికి ప్రాణదానమవుతుందని తెలిపారు. మీరిచ్చే రక్తదానం ఎంతోమందికి పునర్జన్మను ఇస్తుందని, ఆసక్తి కలవారు తమ రక్తాన్ని దానం చేయవలసినదిగా వారు కోరారు. ప్రస్తుతం రక్తదాన కొరత ఎక్కువగా ఉన్నదని, తల సేమియా వ్యాధులకు, గర్భిణీ, బాలింతలకు, ప్రమాదవశాత్తు గాయపడిన వారికి మీ రక్తం ఎంతో అవసరం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం పై అవగాహన చేసుకోవాలన్నారు. రక్తదానం చేయువారు సెల్ నెంబర్ 7330800483కు సంప్రదించాలని తెలిపారు.

మధుకర్ దత్తాత్రేయ దేవరస్స్ అందరికీ ఆదర్శం..

- ఆర్ఎస్ఎస్ నాయకులు

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ బాలా సాహెబ్ దేవరసుగా ప్రసిద్ధి చెందిన, తృతీయ సర్సంగ్ చాలక్ మధుకర్ దత్తాత్రేయ దేవరస్ వర్ధంతి సందర్భంగా ఆర్ఎస్ఎస్ నాయకులు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారు చేసిన సేవలను కొనియాడా రు. దేవదాస్ తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో నాగపూర్ లో జన్మించి, ఆంధ్రప్రదేశ్లో తిరిగి అంచలంచెలుగా ఆర్ఎస్ఎస్కు సేవలను కొనసాగించడం జరిగిందని తెలిపారు. బాలా సాహెబ్ దేవరస్ ఆర్ఎస్ఎస్ చీఫ్ గా ఉన్న కాలంలో బురావు దేవరస్ ఉత్తర భారత దేశంలోని సంస్థలో తీరిక పాత్ర పోషించడం జరిగిందన్నారు. డాక్టర్ కే.బి హెచ్ కే వార్ స్ఫూర్తితో వారు వారి జీవితాన్ని ఆర్ఎస్ఎస్ లక్ష్యాలకు అంకితం చేయడం జరిగిందన్నారు. హిందు అంటే ఏ విధమైన ఒక మత విశ్వాసానికి మాత్రమే పరిమితం కాదని హిందువు అనేది ఒక సంస్కృతిని విశ్వసించే వారిని కలిగి ఉంటుందని తెలిపారు. కాబట్టి హిందూ అంటే ప్రత్యేకమైన మత విశ్వాసము అని అర్థం కాదు అని ఒకే దేశం- ఒకే సిద్ధాంతం అని తెలిపారు. వీరి హయాంలోనే హిందూ సమాజం షెడ్యూల్ కులాల సభ్యుల అభ్యున్నతికి సేవా భారతి ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ అనేక కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగిందని తెలిపారు. సేవా భారతి ద్వారా ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు పాఠశాలలను ప్రారంభించడం జరిగిందని, మురికివాడల ప్రజలకు అంటరాని వారికి వృత్తిపరమైన కోర్సులు కూడా అందించడం జరిగిందని తెలిపారు. అంటరానితనం తప్పు కాకపోతే ప్రపంచంలో ఏది కూడా తప్పు కాదు అని దేవరస్ చెప్పడం జరిగిందని తెలిపారు.

వచ్చే నెల 13వ తేదీ నుంచి ఏడు శనివారాల వ్రతం...

అర్చకులు రాజేష్ ఆచార్యులు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శ్రీనివాస నగర్ (గుడ్డి బావి వీధి) లో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జూలై 13 వ తేదీ నుండి ఆగస్టు 31 వ తేదీ వరకు ఏడు శనివారంల వ్రతమును నిర్వహిస్తున్నట్లు అర్చకులు రాజేష్ ఆచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జగదీశ్వర ప్రసాద్, జింక రాజేంద్రప్రసాద్, చెన్నం శెట్టి శ్రీనివాసులు, చెన్నం శెట్టి రమేష్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏడు శనివారాల వ్రతం దేవాలయములో సామూహికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల మహిళలు దేవాలయములో అర్చకులకు గాని ఆలయ కమిటీ వారిని సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ వ్రతమును ప్రతి సంవత్సరము నిర్వహించడం జరుగుతుందని, ఈ వ్రతం చేయడం వలన కుటుంబంలోని సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. పూజా సమయం ప్రతి శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9985245013 కు సంప్రదించవచ్చునని తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యాపార దుకాణాలకు టెండర్ల ఆహ్వానం..

ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో మొత్తం పది గదులకు వ్యాపారం కొరకు టెండర్లను నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల గడువుతో వ్యాపార నిర్వహణకు గాను ఆసక్తి గల వ్యాపారస్తులు షీల్డ్ టెండర్లను వేయాలని తెలిపారు. టెండర్ల ధరావత్తు వ్యాపారమును బట్టి పదివేల నుండి 1,00,500 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 15వ తేదీ నుండి 25వ తేదీ వరకు డిపో మేనేజర్ కార్యాలయము నందు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు రూ.885 చెల్లించి టెండర్ ఫారం పొందవచ్చునని తెలిపారు. పూరించిన టెండర్ ఫారంను ఈనెల 27వ తేదీ జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం పుట్టపర్తి నందు ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల లోపు టెండర్ బాక్సు నందు వేయాలని వారు తెలిపారు. తదుపరి మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు తెరువబడునని తెలిపారు. ఆసక్తి గల వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకొని వ్యాపార అభివృద్ధితో పాటు ఆర్టీసీ ఆదాయానికి సహకరించాలని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9959225859 కు గాని 7382861410 కు గాని 7382860501 కు గాని సంప్రదించాలని తెలిపారు.

మంత్రి సవితమ్మకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి యువ శేఖర్

విశాలాంధ్ర-గోరంట్ల : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మరియు చేనేత టెక్స్టైల్ శాఖ మంత్రి సవితమను విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పుష్పగుచ్చం అందజేశారు. భవిష్యత్తులో మరెన్నో పదవులు అలంకరించాలని ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా ఆ దేవుడి దయ మీపై మీ కుటుంబం పై ఉండాలని నిమ్మల యువ శేఖర్ ఆకాంక్షించారు. అలాగే టీడీపీ నాయకులు రుషభ దేవుడు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

అసైన్డ్ భూముల పట్టాల వ్యవహారం నిగ్గు తేల్చండి...

విశాలాంధ్ర-ధర్మవరం : ధర్మవరం నియోజకవర్గం వ్యాప్తంగా గత ప్రభుత్వం ఇచ్చిన అసైన్ భూముల వ్యవహారం కుంభకోణం ఒక చరిత్రలో నిలిచిపోయే విధంగా గత ప్రభుత్వ అధికారులు చేయడం జరిగిందని ధర్మవరం అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జి.గోపాల్ రెడ్డి దుయ్యపట్టారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని బిజెపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం మండలాల్లో భూమిలేని నిరుపేదలను గుర్తించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైంది అని మండిపడ్డారు. అందులో భాగంగా వారికి కావలసిన వైపీపీ నేతలకే భూములను కట్టబెట్టారు అని తెలిపారు. లక్షల రూపాయలు అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది అని, దాదాపు నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యి ఎకరాల పైన అక్రమాలు జరిగాయి అని ఆరోపించారు. ఈ వ్యవహారం అంతా అధికారుల కను సన్నల్లోనే జరిగింది, కావున గత వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రివర్యులు వైసత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అధికారులు నియోజకవర్గ వ్యాప్తంగా భూమిలేని నిరుపేదలను గుర్తించి, సాగుకు పనికొచ్చే భూములను వారికి కేటాయించాలని ధర్మవరం నియోజకవర్గం బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా తప్పు చేసిన అధికారులను గుర్తించి, వారిపైన చర్యలు తీసుకుని, తగిన శిక్ష విధించాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా బీజేపీ పార్టీ ఉపాధ్యక్షులు జింక చంద్రశేఖర్, ఓబులేసు, జిల్లా సీనియర్ నాయకులు కావేటి మల్లి కార్జున, గొట్లూరు రామకృష్ణ, కృష్ణ ప్రసాద్, పోతలయ్య, జల్లా కార్తీక్, తదితరులు పాల్గొన్నారు

మంత్రి సవితకు శుభాకాంక్షల వెల్లువ

విశాలాంధ్ర-పెనుకొండ : బీసీ సంక్షేమ ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమము జౌలి శాఖ చేనేత పరిశ్రమ మంత్రి సవితకు స్థానిక నాయకులు శుభాకాంక్షలు తెలిపేందుకు విజయవాడకు పెనుకొండ నియోజకవర్గం నుంచి నాయకులు క్యూ కడుతున్నారు. తమ అభిమాన నాయకురాలు ఎమ్మెల్యే కావడం మంత్రి పదవి రావడంతో స్థానిక నాయకులకు ఆనందంతో ఆమెను కలవడానికి విజయవాడ బయలుదేరి వెళ్తున్నారు. ఆమె తో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ యొక్క ఆకాంక్షలను మంత్రికి తెలియజేస్తూ ఆమెకు పూల బొకేలతో శాలువాలతో సన్మానిస్తూ మిఠాయిలు పంచుతున్నారు. స్థానిక నాయకులు గోరంట్ల మండలానికి చెందిన యువ తెలుగుదేశం నాయకులు కమలాకర్, జనసేన నాయకుడు సంతోష్, ఊరికే శ్రీరాములు, ఆదినారాయణ, ఆదిశేషు, నాగరాజు, పిఆర్ ఇంజనీర్లు జగదీష్, గోపాల్ నాయక్, మరియు ఉన్నతాధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కలుస్తున్నారు.

శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహ ప్రతిష్ఠ కోసం భూమి పూజ ..

విశాలాంధ్ర-కదిరి: పట్టణంలో విద్యుత్ సబ్ స్టేషన్ సమీపాన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయల విగ్రహ ప్రతిష్టాపన భూమి పూజ కార్యక్రమంలోఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.శ్రీ కృష్ణ దేవరాయల విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేయడం అదృష్టంగా భావిస్తున్నని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లూమూన్ విద్యా సంస్థల అధినేత బలిజ సంఘం నాయకులు మంచి శివశంకర్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భైరవ ప్రసాద్ ,ఆ సంఘం అధ్యక్షులు రమేష్ బాబు,కందుకూరు నాగరాజు,చింత శ్రీనివాసులు, జనార్ధన్,రవీంద్ర,నాగేంద్ర ప్రసాద్, అడ్వకేట్ శివశంకర్ బైరిశెట్టి,మోహన్, కుటాల లక్ష్మణ్ బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలను తప్పక పరిష్కరిస్తాను..

ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వెల్లడి

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణంలో చేనేత సమస్యలను తప్పక పరిష్కరిస్తారని ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు 17వ వార్డులో చేనేత నాయకులతో పాటు ఇంటింటా వారు తిరిగి చేనేత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో నారా భువనేశ్వరి నిజం గెలవాలి అన్న కార్యక్రమంలో భాగంగా వారు చేనేత కుటుంబాలను పరామర్శించడం జరిగిందని అధికారంలోకి రాగానే వారికి అండగా ఉంటాం అన్న భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. అందుకే మరోసారి వాటిలోని చేనేతలను కలవడం జరిగిందని, చేనేత కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను తప్పక పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు చట్టా లక్ష్మీనారాయణ, పరిసే సుధాకర్, పురుషోత్తం గౌడ్, సంద రాఘవ, జింకా పురుషోత్తం, బీరే శ్రీనివాసులు, అధిక సంఖ్యలో చేనేత నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్యాగం, దానాలకు ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండుగ

సామూహిక ప్రార్ధనలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్

విశాలాంధ్ర-కదిరి: సమాజ హితం కోసం మహమ్మద్ ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ.. దానం, సాయం, త్యాగం వంటి సుగుణాలను ప్రతిబింబింపజేస్తుందని ఈ పండుగ సమస్త మానవాళికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా కదిరి పట్టణంలోని ఈద్గాలో ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్ధనలలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ముస్లీంలు జరుపు కుంటారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని సంక్షేమ పాలనలో ముఖ్యమంత్రికి అల్లా ఆశీస్సులు ఉండాలని ఆకాక్షించారు. ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు సందేశానిచ్చారు. బక్రీద్ ప్రార్ధన అనంతరంపట్టణ రాష్ట్ర ప్రజలకు శుభాకాక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, అల్ఫా ముస్తఫా, ఖాదర్ బాష, పట్టణంలోని ముస్లిం మత పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విశాలాంధ్ర-తలుపుల : మండల వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్దలతో బక్రీద్ ప్రార్ధనలు ఘనంగా నిర్వహించారు. తలుపుల మేజర్ పంచాయతీలో కుమ్మరపేట ఈద్గాన వద్ద హజరత్ అల్లాబక్షు ఆధ్వర్యంలో ప్రార్ధన నిర్వహించారు. అదేవిధంగా ఓబుల్ రెడ్డి పల్లి నూతన కాలువ వేప మాను పేట పెద్దన్నవారిపల్లి ఓదులపల్లి గ్రామాల్లో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థిస్తున్నామని ముస్లింలు ప్రార్ధనలు నిర్వహించారు.

కొత్త చెరువు మండలంలో...

విశాలాంధ్ర-కొత్తచెరువు : మండల వ్యాప్తంగా బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. కొత్త చెరువులో ఉదయం ముస్లిం సోదరులు ధర్మవరం రోడ్డులో ఉన్న ఈద్ మైదానానికి వందలాదిమంది ముస్లింలతో కలిసి ర్యాలీగా నినాదాలు చేస్తూ అక్కడికి వెళ్లారు. ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈద్ ప్రాంతాల వద్ద మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

కిటకిటలాడిన ఈద్గా మైదానాలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. పట్టణ సమీపంలోని కేతిరెడ్డి కాలనీలో గల ఈద్గా మైదానంలో సామూహికంగా ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మత పెద్దలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు (నమాజ్) నిర్వహించుకున్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ నరేంద్ర చౌదరి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులను ఆలింగణం చేసుకొని ఈద్ ముబారక్ ను ప్రతి ఒక్కరికి తెలియజేశారు. ముస్లింలు సంతోషంగా జీవించాలని తాము ప్రత్యేక ప్రార్ధనలు చేయడం జరిగిందని తెలిపారు. ఇస్లాం లో త్యాగం దాన గుణాలకు ప్రత్యేకమైన స్థానము ఉందని ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకునే పండుగనే బక్రీద్ను జరుపుకుంటారన్నారు. ముస్లిముల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా ఎమ్మెల్యే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ ద్వారా పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. తదుపరి ముస్లిం సోదరులు పిల్లలు ఒకరినొకరు ఆలింగణం చేసుకొని ఈద్ముబారక్ తెలుపుకున్నారు.

విశాలాంధ్ర-అగళి : మండలకేంద్రంలో ఉదయం ముస్లిం సోదరులు బస్ స్టాండ్ నుంచి ఈద్ మైదానానికి వంద లాది మంది ముస్లింలతో కలిసి ర్యాలీగా నినాదాలు చేస్తూ అక్క డికి వెళ్లారు. ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈద్ ప్రాంతాల వద్ మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

ముదిగుబ్బ మండలంలో..

విశాలాంధ్ర-ముదిగుబ్బ: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ పర్వదినాన్ని ముస్లింలు మండలవ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. స్థానిక ఈద్గాలలో బక్రీదు పండుగ ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకున్నారు. పాత ఊరు నూరే మదీనా మజీద్, మత పెద్ద హజరత్ బాబా సాహెబ్ రైల్వే గేట్ వద్ద ఉన్న ఈద్గా మైదానంలో పండుగ రోజు చేసుకొనే ప్రత్యేక నమాజులు జరిపించారు. త్యాగం, భక్తి, విశ్వాసానికి, ప్రతీక బక్రీద్ పండగ గొప్పతనాన్ని జమాత్‌కు వివరించారు. కదిరి రోడ్డులోని ఈద్గా మైదానంలో జామియా మసీద్, మక్కా మసీద్ ల మత పెద్దలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మత పెద్దలు, మతవల్లీలు, జమాత్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-బుక్కపట్నం : మతసామరస్యానికి ప్రతికైనా బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్లి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి మహమ్మద్ ప్రవక్త త్యాగనిరతిని స్మరించుకుంటూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

విశాలాంధ్ర-గుడిబండ : రాళ్లపల్లి, శంకరగల్లు, కేఎన్ పల్లి, గుడిబండ, హూన్సేన్ పురం, కొంకల్లు, మండలపల్లి, తదితర గ్రామాలలో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు ర్యాలీగా బయలుదేరి మసీదుకు చేరుకొని ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ చాంద్ భాష, తెదేపా మైనార్టీ మండల అధ్యక్షుడు షబ్బీర్, గౌస్ పీర్, నజీర్, ముబారక్,షాభూ, కొంకల్లు మత్తుసాబ్,ఫక్రుద్దీన్ తదితర మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.